క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

యాదమరి: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సోమవారం మూడు వాహనాలు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన ఒక ద్విచక్ర వాహనం, రెండు కార్లను ఉదయం 11 గంటలకు పోలీసు స్టేషన్ ఆవరణలో వేయనున్నట్లు తెలిపారు.

కంటి ఆపరేషన్లకు 85 మంది ఎంపిక

చిత్తూరు రూరల్: కంటి ఆపరేషన్లకు 85 మంది ఎంపికైనట్లు జైన్ సంఘం కార్యదర్శి సుభాష్ జైన్ తెలిపారు. స్థానిక జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. కంటి సమస్యలు ఉన్నవారిని 182 మందిని పరీక్షించగా అందులో 85 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారని సుభాష్‌జైన్ తెలిపారు. వీరికి రవాణా, వసతి సదుపాయాలతో ఆపరేషన్ చేయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, కమలేష్, అమిత్, రవిచౌహాన్, ఎవంత్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ల్లో తనిఖీలు



ఐరాల: మండలంలోని వైఎస్ గేటు, తిరువణంపల్లె, అగరంపల్లె పెట్రోల్ బంకులను ఆదివారం తహసీల్దార్ సుశీలమ్మ తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. కార్బన్ డయాక్సైడ్ సిలిండర్, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. పెట్రోల్ బంక్‌లో ఏదైనా సమస్య వస్తే తహసీల్దార్ కార్యలయానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అహ్మద్ బాషా పాల్గొన్నారు.

అలరించిన ధ్యాన కచ్చేరి



బోధిస్తున్న పిరమిడ్ మాస్టర్ రాధిక

తవణంపల్లె: మండలంలోని శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన నిర్వహించిన సంగీత ధ్యాన కచ్చేరి అద్భుతంగా సాగింది. అన్నమయ్య వంశస్తురాలు శ్రీ షణ్ముఖ సారథ్యంలో శ్రీవాణి, పద్మప్రియ సంగీత ధ్యాన కచ్చేరి భక్తులను అలరించింది. అన్నమయ్య కీర్తనలతో ధ్యానులను మైమరపించారు. అనంతరం పిరమిడ్ మాస్టర్ రాధిక ఆత్మధ్యాన బోధన చేశారు.

ఈ క్రాప్ నమోదుతో రైతుకు భరోసా

- నష్టపోయిన పంటకు పరిహారం
- ధాన్యానికి గిట్టుబాటు ధర



పంట వివరాలు సేకరిస్తున్న అధికారులు



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గుడిపాల: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పాటు పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. కరువు, అధిక వర్షాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం అందిస్తోంది. రైతులకు ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి.

ఈ-క్రాప్ నమోదు ఇలా..

వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు, పంటల సాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ-కేవైసీ నమోదు చేయించాలి. ఇలా ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్టపరిహారం, పంటల గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుల మందులు తదితరాలు రాయితీపై అందుతాయి. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి.

పంట నమోదు వివరాలు

మండలంలోని 32 రెవెన్యూ గ్రామాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 1,867 మంది రైతులు సుమారు 1,820 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ప్రధానంగా వరి, వేరుశనగ, మిరప, అరటి, ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో వ్యవసాయ సిబ్బంది 95 శాతం ఈ-క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ పూర్తి చేశారు. ఈనెల 28 వరకు అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతులు త్వరపడాలి

పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, రైతుల పొలం వద్దకే వెళ్లి పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది పంట నమోదు చేసిన ప్రతి రైతు కూడా తప్పనిసరిగా రబీ పంట ఈ-కేవైసీ ఈనెల 28వ తేదీలోపు చేసుకోవాలని అధికారులు తెలిపారు. పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ఈ-కేవైసీతో పాటు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.

రైతులకు వరం లాంటిది



రైతులు తాము పండించే పంటలను ఈ-క్రాప్ చేసుకుంటే పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వమే వారికి పరిహారం అందజేస్తుంది. గిట్టుబాటు ధర, ఇన్‌పుట్ సబ్సిడీలు రైతులకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను అందజేస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ప్రభుత్వం అనేక పథకాలను అందజేస్తోంది.
– మాధవి, వ్యవసాయాధికారి, గుడిపాల

ఈ-క్రాప్ నమోదు వరం



ఈ-క్రాప్ నమోదు చేయించడం రైతులైన తమకు ఓ వరం లాంటిది. గతంలో పంటలు వేసుకొని నష్టపోతే ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చేవి కావు. ప్రస్తుతం పంట నష్టం వస్తే ఇన్‌పుట్ సబ్సిడీ కింద నగదును అందజేయడం చాలా ఆనందంగా ఉంది. దీంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. నాకు ఉన్న మూడు ఎకరాల పొలంలో ఈ-క్రాప్ నమోదు చేశాను.
– రామూర్తినాయుడు, ముత్తువాళ్లూరు, గుడిపాల

రైతులకు ఎంతో మేలు



రైతుల కోసం ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది. గతంలో ఎరువులు, పురుగుల మందులు కావాలంటే పట్టణానికి వెళ్లాల్సిందే. అయితే ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉన్న ఊర్లోనే అందిస్తున్నారు. దీంతో పాటు తాము పండించే పంటను ఇక్కడే అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. రైతులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారు.
– గోవిందమండడి, రైతు, గుడిపాల

ఉచిత వైద్యం సంతోషకరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

యాదమరి: మండల పరిధిలోని చిత్తూరు బెంగళూరు జాతీయ రహదారిలోని మోర్ధానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ రిషాంత్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించడం సంతోషకరమన్నారు.

విద్యార్థులకు విద్యా వినోదం



ఫుడ్ కోర్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని గంగనపల్లెలో ఉన్న క్యాంఫోర్డ్ పాఠశాలలో ఆదివారం విద్యా వినోద వేడుకలు నిర్వహించారు. వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఆ పాఠశాల కరస్పాండెంట్ సీఆర్.మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువు, ఆటలకే పరిమితం కాకుండా వివిధ అంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కీర్తి, డైరెక్టర్ దీక్ష, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై పట్టుసాధించాలి



విద్యార్థిని నగదుతో సత్కరిస్తున్న దాత పార్థసారథి నాయుడు

చిత్తూరు రూరల్: విద్యార్థులు చదువుపై పట్టుసాధించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రజాహిత సేవాసంస్థ అధ్యక్షులు రాజరత్నంరెడ్డి అన్నారు. నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రైవేటు పాఠశాల విద్యార్థి లాస్య ఏకోఫ్రెండ్లీ ప్రజెంటేషన్‌లో ఉత్తమ ప్రతిభ సాధించినందుకు దాత పార్థసారథి నాయుడు రూ.10 వేలతో సత్కారించారు. పలువురు టీచర్లను, దాతలను సంస్థ నిర్వాహకులు జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో బాలరాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మన్మథరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసుల రెడ్డి, కాణిపాకం ఎస్ఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 –5 గంటల మధ్య స్పందన నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రజలు ఇంటినుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్: 08572232745, వాట్సప్- 98499 07885 నెంబర్లకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు సమస్యలుంటే అధికారుల దృష్టికి నేరుగా తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల: మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ మోహన్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామాల్లో సమస్యలను గుర్తించి సమావేశం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. అర్హులెవరికైనా ప్రభుత్వ పథకాలు అందని పక్షంలో తక్షణం అధికారుల దృష్టికి తీసుకెళ్లి లబ్ధి పొందేలా చూడాలని చెప్పారు. బొమ్మసముద్రం పాఠశాలలో పెచ్చులు ఊడిపడుతున్నాయని, మొరవ నీరు రోడ్డుపై ప్రవహించడంతో పాచికట్టిందని సర్పంచ్ రఘు సభ దృష్టికి తెచ్చారు. దీని వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడ్డుతున్నారని, పట్టాదారు పాసు బుక్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యలపై మొదటగా ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి ప్రతిస్పందిస్తూ తన దృష్టికి పాఠశాల సమస్య వచ్చిందని, నాడు-నేడు పథకం కింద ఫేజ్-3 లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఏపీఓ సంధ్య స్పందిస్తూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సోమవారం నుంచి రోడ్డుపై కల్వర్టు పనులు ప్రారంభించాలని సర్పంచ్‌కు తెలిపారు. తహసీల్దార్ సుశీలమ్మ పాసుబుక్‌లపై స్పందిస్తూ దరఖాస్తు చేసుకున్నవారికి 28 రోజుల్లో పట్టాదారు పాస్‌బుక్‌లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిత్య, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారలు పాల్గొన్నారు.

40 ఏళ్ల నాటి తీపి గుర్తుల స్మరణ



అరగొండ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, వారి గురువులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. 1983–84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో విద్యా బోధన చేసిన గురువులను సత్కరించి, ఆశీస్సులు పొందారు పూర్వ విద్యార్థులు చిన్ననాటి సంగతులను నెమరువేసుకున్నారు. వారందరూ కలిసి పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమం నిర్మల, మునిరాజ్, వెంకటచలం, చంద్ర, కేశవులు, పూర్ణ, లోకేశ్వర్‌రెడ్డి, మనోజ్ సహకారంతో నిర్వహించారు.

అయ్యోర్ల వర్గ పోరు

విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఉపాధ్యాయులే దారి తప్పారు. బోధన పక్కన పెట్టి గొడవలకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయ బృందం ఒకవైపు, హెచ్ఎం మరోవైపు వర్గాలుగా విడిపోయాయి. వీరు పిల్లల భవిష్యత్‌ను గాలికొదిలేసి, పంతం నెగ్గించుకునే పనిలో పడ్డారు. ఈక్రమంలోనే పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు జోక్యం చేసుకున్నా ఉపాధ్యాయులు మాత్రం వర్గ పోరులో మునిగిపోయారు. ఇదంతా సిద్ధంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్వాకం.



పాఠశాల ఆవరణలో అయోమయంతో ఎదురుచూస్తున్న విద్యార్థులు

- టీచర్ల మధ్య ముదిరిన వివాదం
- పరస్పరం ఫిర్యాదుల పరంపర
- అయోమయంలో విద్యార్థులు
- గందరగోళంగా బడి నిర్వహణ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలోని పీవీపీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 145 మంది చదువుతున్నారు. వీరికి పాఠాలు బోధించేందుకు 8 మంది ఉపాధ్యాయులు ఇక్కడ పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ గత కొంత కాలంగా ఉపాధ్యాయుల నడుమ వర్గపోరు నడుస్తోంది. ప్రధానంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వర్గాలుగా విడిపోయారు. దీనికి తోడు దాతలంటూ పెత్తనం చెలాయిస్తున్న కొందరికి హెచ్‌ఎంకు మధ్య పాఠశాల ఎన్నికల సమయంలో వాగ్వివాదం చోటుచేసుకుంది. గతంలో జరిగిన సంఘటనలు, హెచ్‌ఎంకు ఉన్న వ్యతిరేకతను బలంగా మలుచుకున్న కొందరు వ్యక్తులు ఉపాధ్యాయులను రెచ్చేగొట్టేశారు. ఇలా మొదలైన ఆ వేడి వారి మధ్య కొన్నాళ్లుగా రగులుతూనే ఉంది. చిలికిచిలికి గాలివానలా మారినట్లు ఈ వ్యవహారం రోడ్డున పడింది.

నాలుగు రోజుల క్రితం

ఈ పాఠశాలలో నాలుగు రోజులకు క్రితం ఉపాధ్యాయులంతా నువ్వెంత అంటే నువ్వెంత అనే రీతిలో పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. ముందుగా పిల్లలను ఎవరికి వారు అనుకూలంగా మలుచుకున్నారు. పిల్లలను రెచ్చగొట్టి బడి ఆవరణలోకి రప్పించారు. అలాగే కొంత మంది బయట పిల్లలను తీసుకొచ్చి హెచ్‌ఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయించారు. స్కూల్‌కి హెచ్‌ఎం రాకూడదంటూ గోలగోల చేశారు. దీంతో తల్లిదండ్రులు కూడా అక్కడికి చేరుకున్నారు. కొందరు ఒక వర్గానికి మద్దతునిస్తే, మరి కొందరు మరో వర్గానికి వత్తాసు పలికారు. మొత్తానికి చుట్టూ పక్కల ఉన్న గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని అప్పటికి సర్దుబాటు చేయగలిగారు. అయినా ఉపాధ్యాయులు ఎవరి గోల వారిదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పెట్టుకుంటున్నారు. పిల్లల తల్లిదండ్రుల ద్వారా సంతకాలు సేకరించి సోమవారం స్పందనలో ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పాఠాలను పక్కనపెట్టి...

ఈ రాద్ధాంతంతో హెచ్‌ఎం సెలవులో వెళ్లిపోయారు. ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులకు వచ్చి వెళుతున్నారు. ఏ ఉపాధ్యాయుడు ఎప్పుడు పాఠశాలకు వస్తాడో ఎవరి పాఠాలు చెబుతారో కూడా తెలియని పరిస్థితి. ఇలా ఉపాధ్యాయుల పంతాలు పిల్లల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా మార్చేశాయి. పరీక్షల గడువు సమీపిస్తున్నా విద్యార్థులను పట్టించుకునే స్థితిలో ఉపాధ్యాయులు లేకపోవడం గమనార్హం. పంతం నెగ్గించుకోవడానికి ఉపాధ్యాయులందరూ రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతు కూడగట్టుకునే నేపథ్యంలో గ్రామాల్లో తిరుగుతున్నారు. ఈ ఉపాధ్యాయుల వర్గపోరుకు విద్యార్థులను, తల్లిదండ్రులను వాడుకుంటున్నారు. ఒకవేళ ఉన్నతాధికారులు విచారణకు వస్తే, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు తమకు మద్దతునిచ్చేలా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఈ గొడవలు తెలియడంతో సచివాలయ సిబ్బంది వెళ్లి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పాఠశాలలో ఉపాధ్యాయుల గొడవలకు దూరంగా ఉండాలని, చదువు మీద దృష్టి పెట్టాలని సూచించారు. అయితే పదో తరగతి పరీక్షలు దగ్గర పడే సమయంలో ఉపాధ్యాయుల గోల ఏమిటని మరి కొందరు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఈ ఉపాధ్యాయుల వర్గపోరుకు పరిష్కారమార్గం చూపాల్సిన అవసరం ఉంది.

గ్రామాల్లో ఆటలమ్మ అలజడి

- ముందు జాగ్రత్తలు తప్పనిసరి
- వేసవి ప్రారంభంలో అంటువ్యాధుల తాకిడి



చికెన్‌పాక్స్ సోకిన బాలుడు

బంగారుపాళెం: మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆటలమ్మ క్రమంగా విజృంభిస్తోంది. వేసవి కాలం ప్రారంభమైతే చాలు చికెన్‌పాక్స్ (ఆటలమ్మ), గవదబిళ్లల సమస్య పిల్లల్లో కనిపిస్తుంది. మార్చిలోకి అడుగుపెట్టకముందే ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్‌పాక్స్, గవదబిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశం ఉన్నా ప్రధానంగా చిన్నపిల్లలకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుందన్నారు. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటిపొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచనల మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని మిగతావారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వడమే మంచిది. గవదబిళ్లలు వచ్చినవారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవపదార్థాలనే ఇవ్వాలి. చికెన్‌పాక్స్, గవదబిళ్లలు వచ్చినవారి విషయంలో ప్రజల అపోహలు, మూఢనమ్మకాలతో వైద్యం చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లలు వంటి అంటువ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్నపిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి. – డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, వైద్యాధికారి, పీహెచ్‌సీ.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

గుడిపాల: చదవడం మాకిష్టం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించవచ్చని గ్రంథాలయాధికారి గజేంద్ర అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, దినపత్రికలతోపాటు పలు పుస్తకాలను చదవడం వల్ల వారిలో నైపుణ్యం పెరగడంతోపాటు ఉద్యోగాలు పొందేందుకు వీలవుతుందన్నారు. గతంలో చాలామంది గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు సాధించారని చెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను చదవాలని కోరారు.